# తల్లి

"నీ ఆతిధ్యం మండినట్టేవుంది! ఎండలో వచ్చిన అతిధికి కాసిన నీళ్ళయినా పోయవేమిట్రా!" చమత్కారంగా అన్నాడు మూర్తి. వచ్చి అరగంటయినా ఏ పానీయమూ రాకపోవడంచూసి.

"ఆతిధ్యాని కేం లోటు! నుయ్యి చల్లగావుండగా!" రామం తమాషాగా అంటూనే, "లలితా, మనవాడు వచ్చాడు. వి. ఐ. పి. ఎలా సత్కరిస్తావో నీ యిష్టం!" అంటూ లోపలికి కేకవేశాడు.

"నీలాగ వేళాపాళ లేకుండా వచ్చే అతిధులకి సత్కారాలు చెయ్యడానికి అలనాటి పాండవులకి మల్లే ఏ అక్షయపాత్రయినా వుంటే బాగుండును! రామం అన్నమాటలకి మనసారా నవ్వుకుంటున్న యిద్దరి నవ్వులు హడావిడిగా తలుపు త్రోసుకుని లోపలికి ప్రవేశించిన ఆమెని చూడగానే ఆగిపోయాయి.

ఆ వచ్చిన యువతి ఆందోళనగా నాలుదిక్కులూ చూసింది. తలుపు వెనకాల, సోఫా వెనకాతల, గోడమూలలు అంతటా ఆత్రుతగా దేనికోసమో వెతుకుతూంటే మూర్తి తెల్లబోతూ రామంవైపు చూశాడు. రామం నిర్వికారంగా చూస్తూ కూర్చున్నాడు.

"రాజా!....ఓ రాజా!....బాబూ, ఎక్కడికి పోయావు? రా నాన్నా, ఇంటికి పోదాం ...ఏమండీ, మా రాజా ఇక్కడికి వచ్చాడా?....ఎక్కడికి పోయాడో!....వెతకలేక పోతున్నాను....మరీ అల్లరివాడయి పోతున్నాడు రోజు రోజుకి!".... చిన్నగా విసుక్కుంటూ అంది ఆమె.

"లేదమ్మా!.........యిక్కడికి రాలేదు. యింకెవరి యింటికన్నా వెళ్లాడేమో; లేకపోతే మీ యింట్లోనే ఎక్కడన్నా ఆడుకుంటున్నాడేమో! ...సరిగ్గా చూడండి—" రామం అన్నాడు.

"రాలేదా?....అయితే యింకెక్కడికి వెళ్లాడో?" తనలో తను అనుకుంటూ బయటికి వెళ్ళిపోయింది ఆమె,

అప్పుడే లోపలికి కూల్ డ్రింక్స్‌తో, పకోడీలప్లేటుతో వచ్చిన లలిత ఆ యువతి వెళ్ళినవైపు కోపంగాచూస్తూ........"మళ్ళీ తయారయిందా?... అదో వంక! మీకేం పని లేకపోతేసరి!" రామంవైపు అదోలా చూస్తూ అంది. రామం విననట్లు ఒక గ్లాసు మూర్తికి అందించి తనొకటి సిప్‌చేస్తూ కూర్చున్నాడు. మూర్తి ఏం అర్థంకాక అయోమయంగా కిటికీ లోంచి చూశాడు.

ఎదురింటినించి ఒక ముసలాయన ఆమెని పిలుస్తున్నాడు. "రా, అమ్మా! లోపలికి, రాజా ఇంట్లోనే వున్నాడు, మంచంక్రింద దాక్కున్నాడు నువ్వు రా!" అంటూ లోపలికి తీసుకెళ్లాడు ఆమెని.

లలిత లోపలికి వెళ్ళగానే, "ఎవరామె? ఎవరికోసం అలా వెతుకుతూంది?" కుతూహలంగా అడిగాడు మూర్తి.

"వాళ్ళ అబ్బాయికోసం వెతుక్కుంటూంది. ఆవిడకెప్పుడూ ఆ రాజాని వెతుక్కోవడంతోనే సరిపోతుంది! మా యెదురింటివారమ్మాయి.... నిర్మల!"

"అదేం, అంత అల్లరిపిల్లవాడా? ఎన్నేళ్ళవాడు? ఎందుకలా వదిలేయడం, తర్వాత వెతుక్కోవడం?"

"ప్చ్!... అసలు పిల్లవాడు వుంటేగా? పిల్లవాడూ లేడు, పారిపోనూ లేదు.... అల్లరీకాదు! ఆవిడ అలా వెతుకుతూ వుంటుంది. అంతే, ఏదీ ఆమెని కష్టపెట్టడం ఇష్టంలేక, ఇక్కడ లేడంటూ వుంటాను!"

ఆశ్చర్యపోయాడు మూర్తి. వింతగా చూశాడు.

"పాపం, మతి స్థిరంలేదు....ఆ పిల్లవాడి ధ్యాసలో మతి స్థిరం, తప్పి....అలా లేని పిల్లవాడికోసం వెతుకుతూ వుంటుంది!"

తెల్లపోయాడు మూర్తి. నిక్షేపంలా, మామూలుగా వుంది. శుభ్రంగా బట్టలు అదికూడ కట్టుకుంది! చక్కగా మాట్లాడుతూంది. ఆమెకి పిచ్చేమిటన్న సందేహంతో, అదే అడిగాడు మూర్తి.

"అవును, అంతా మామూలుగానే వుంటుంది. ఆ పిల్లవాడి బెంగ తప్ప."

"ఏమయ్యాడు ఆ అబ్బాయి? చచ్చిపోయాడా?" అత్రుతగా అడిగాడు మూర్తి.

అబ్బే, బాగానే వున్నాడు....వాళ్ళ నాన్నదగ్గర....నిజానికి నాన్న దగ్గర కాదు, తాత దగ్గర.

"ఏమా కథ?" సిగరెట్టు ముట్టించాడు మూర్తి సంగతేమిటో వినాలన్న కుతూహలంతో.

"అబ్బ, పోనిద్దూ, .... అదో కన్నీటిగాథ! .... మొదలెడ్తే యిప్పట్లో అవదు! యీ భాగోతం రోజూ మాకు అలవాటయిపోయింది.... కాసేపు ముగ్గురం రమ్మీ ఆడదామా ?....లలితా!...."

"ముందీ కథేదో చెప్పు; వినేదాకా నా మెదడు పనిచెయ్యదు."

"ఏం చెప్పమంటావు ? అదొక పెద్ద కథ!" గ్లాసు పూర్తిచేసి మెల్లిగా మెదలెట్టాడు రామం.

"మా యెదురింటి అయన్ని చూశావుగా, పెద్ద ప్లీడరులె. బాగా సంపాదించాడు! బోలెడు ఆస్తి, యిద్దరు పిల్లలు, ఒక కూతురు, కొడుకు. ఈ అమ్మాయే పెద్దది. ఇప్పుడింకా ఈ మనోవ్యాధితో పాడయిపోయిందిగాని వయస్సులో అప్పుడు చాలా బాగుండేది. చాల అందంగా, నాజూగ్గా వుండేది. నాకు కాలేజీలో జూనియర్. కాలేజీలో బ్యూటి పడిగా అనేవారు. ఆమె చిరునవ్వుకోసం క్యూ నిలబడే వందల్లో నేనూ ఒకణ్ణి. ఎంతో తెలివైంది బి.ఏ.ప్యాసయ్యాక మామూలుగా పెళ్ళిసంబంధాలు చూశాడాయన, కలెక్టర్లు, యింజనీర్లు, డాక్టర్లు ఎన్నెన్నో పెద్దసంబంధాలుచూశాడు. కొన్ని అమ్మాయికి నచ్చలేదు. కొన్ని ఆయనకే నచ్చలేదు. చదువుంటే, ఆస్తిలేదని ఆస్తుంటే చదువు చాలదని రెండూవుంటే అందంలేదని సాంప్రదాయం మంచిది కాదని యిలాగే మొత్తానికి అన్నింటికి వంకలు పెడ్తూ మొత్తానికి ఏవీ నచ్చలేదు.

తండ్రీ కూతురూ యిద్దరుకూడా ఎంతో అధునాతన అభిప్రాయాలు కల ఆధునికులు. వాళ్ళ ఆధునికతకి సరిపోయే సంబంధాలేవీ దొరకలేదు.

చివరికి హఠాత్తుగా ఓ మంచి సంబంధం కుదరడమూ చాలా

తమాషాగా రైలులో కుదిరింది. ఓ సారి తండ్రి, కూతురు కలకత్తా ఎవరో బంధువుల యింటికి వెడుతున్నారు. రైలులో ఒకతనితో పరిచయం కలిగింది. తెలుగువాడు, బ్రాహ్మణుడు అని తెలుసుకోగానే, యీయన అతని వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు.

అతను చాలా పెద్ద కుటుంబములోంచి వచ్చాడు. అతని చదువంతా విదేశాల్లోనే సాగిందట. మూడువేల జీతంతో కలకత్తాలో ఓ ఇంగ్లీషు కంపెనీకి మేనేజరుగా వుంటున్నాడట, విదేశీయుడిలాగా తెల్లగా, పొడుగ్గా, అందంగా ఆధునికంగా కనపడ్డాడు. ఆ యింట్లో ఆడా మగా అంతా విదేశాల్లో వుంటున్నవారు విదేశాలనించి తిరిగి వచ్చినవాళ్ళు తండ్రికి ఢిల్లీలో పెద్ద ఉద్యోగం !

రైలు ప్రయాణంలో ఆతనిని చూసి, అతని వివరాలు తెలుసుకున్నాక తండ్రి కూతుళ్ళకి అతనిమీద చాలామంచి అభిప్రాయం కలిగింది. అతను ఆయనతో చాలా మర్యాదగా, నిర్మలతో కలుపుగోలుతనంగా మాట్లాడాడు. ఆ వున్న కాస్త టైములోనే! అతనుకూడా నిర్మలమీద యింటరెస్టు చూపిస్తూ వివరాలు అడిగాడుట. యీ ప్లీడరుగారు మాటల సందర్భంలో కూతురికి మంచి సంబంధం దొరికితే పెండ్లిచేయాలని చూస్తున్నానని అన్నారుట, పెళ్ళి ప్రస్తావన రాగానే అతను తనని తల్లిదండ్రులు పెళ్ళి చేసుకోమని బలవంతం చేస్తున్నారనీ, వారి బలవంతం వల్లనే ఏవో పెళ్ళి చూపులకి వెళ్ళివస్తున్నాననీ ఏదీ నచ్చలేదని అన్నాడుట. వీళ్ళకి అడబోయిన తీర్థం ఎదురయినట్లు సంబరపడి, అక్కడికక్కడే యీయన అభ్యంతరం లేకపోతే మీ వాళ్ళ అడ్రసు యిస్తే మా అమ్మాయిని గురించి రాస్తాం.... మీరు స్వయంగా పిల్లని చూశారు కనక మీ అభిప్రాయం చెపితే, మీకేం అభ్యంతరం లేదంటే మీ వాళ్ళ అనుమతి తీసుకుంటానని యీయన రైలులోనే పెళ్ళి మాటలు ఆరంభించాడట. అందుకతను ఏ మాత్రం సందేహించకుండా వెంటనే అక్కడికక్కడే తన యిష్టం తెలిపి,

తనకు నిర్మల అన్ని విధాల నచ్చిందని చేసుకోవడానికి ఏ అభ్యంతరం లేదని, తనకు యిష్టం అయితే వాళ్ళకి ఏ అభ్యంతరం వుండదని చెప్పాడట. వాళ్ళ వాళ్ళ ఎడ్రసు ఇచ్చాడట. తన గురించి వాకబు చేసుకోడానికి కలకత్తాలో తన ఆఫీసు ఎడ్రసు ఇచ్చాడట. అతని జన్మ తేది వగైరాలు అడిగి తీసుకున్నాడు యీయన.

వీళ్ళు మహా సంబరపడ్డారు. ఆలస్యమైనా అదృష్టంకొద్దీ మంచి సంబంధం కుదిరిందని మురిసిపోయారు. కలకత్తాలో ముసలాయన ఎందుకైనా మంచిదని ఆఫీసు ఎడ్రసుకు వెళ్ళి వాకబు చేసి అతను చెప్పిందంతా నిజమేనని ధృవపరచుకున్నారు. అతని తల్లిదండ్రులనించి కొడుకు వప్పుకుంటే తమకేం అభ్యంతరం లేదని, కొడుకు ఎప్పుడు కావాలంటే అప్పుడు పెళ్ళి చేయమని రాశారట.

ఓః వీళ్ళు తెగ మురిసిపోయారు. దమ్మిడీ కట్నం లేకుండా ఇంత మంచి సంబంధం, యింత పెద్ద సంబంధం కుదిరిందని సంతోషపడ్డారు. అతను వీలయినంత త్వరలో వివాహముహూర్తం పెట్టించమని, తనవాళ్ళు ఎవరైనా వీలుంటే వస్తారని లేకపోయినా ఫరవాలేదని రాశాడట. పెళ్ళి చేసుకుని వెంటనే తీసుకువెళ్తాను అని. రాసిందానికంతా వీళ్ళుఅంగీకరించారు.

ఒక నెలలోపునే మంచి ముహూర్తం కుదిరింది. వీళ్ళు అర్భాటంగా ప్రయత్నాలు ఆరంభించారు.

పెళ్ళి యింక నాలుగైదురోజులుందనగా వీళ్ళకో ఆకాశరామన్న వుత్తరం వచ్చింది. ఎవరో వ్రాశారు. 'మీరు మీ అమ్మాయిని యీయబోయే అతనికి యిదివరకే ఓ స్త్రీతో సంబంధం వుంది. అంతేకాక అతనికి రేసులు, త్రాగుడు వగైరా అన్ని వ్యసనాలు వున్నాయని. మీశ్రేయోభిలాషిగా ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. ఆ పిల్ల జీవితం చేతులారా నాశనం చెయ్యకండి.' ఆ ఉత్తరంచూసి వీళ్ళునిర్ఘాంతపోయారు. ఇంగ్లీషులో టైపు చేసిక్రింద సంతకం లేని ఉత్తరం నమ్మాలో లేదో కూడా తెలియలేదు. వీళ్ళకి.

పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేశారు. పెళ్ళికి వారం రోజులుకూడా వ్యవధిలేదు. శుభలేఖలు అందరికీ వెళ్ళిపోయాయి. ముఖ్య బంధువులు అప్పుడే కొంతమంది వచ్చేశారు కూడాను. ఏం చెయ్యాలో తోచక కొట్టు మిట్టాడారు, వీళ్ళు.

హఠాత్తుగా కలకత్తా వెళ్ళి వాకబు చేద్దామన్నా, అతనింటి ఎడ్రసు తెలియదు. వీళ్ళు వెళ్ళాక వీళ్ళ ఎదురుగా అతనలా ప్రవర్తిస్తాడా? ఇంటి అడ్రసు తెలుస్తే చుట్టుప్రక్కల ఎవరినైనా అడిగితెలుసుకోడానికి వీలయేది. ఆఫీసు ఎడ్రసు తెలిసినా ఆఫీసువాళ్ళకి, ఆ మహాపట్నంలో అతనింటి సంగతి, అతని వ్యక్తిగత విషయాలు ఎలా తెలుస్తాయన్నది సందేహం.

ఆఖరికి ఆలోచించి ఆలోచించి ఆతనిపై అధికారికి, అతన్ని గురించి తెలుపమంటూ టెలిగ్రాం ఇచ్చాడు, వివరాలు రాసి. వెంటనే వచ్చిన జవాబులో అతని వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివరాలు తమకేమీ తెలియవని, పని చాలా చక్కగా చేస్తాడని, చాలా సమర్థుడని, ఆఫీసులో మర్యాదగానే వ్యవహరిస్తాడని' వాళ్ళు రాశారు. దాంతోటి వీళ్ళు ఆకాశరామన్న ఉత్తరం ఎవరో అసూయపరులు రాసిందని నిర్ణయించారు. అప్పటికే తన మనసు అతనికి అర్పించిన నిర్మలకుకూడా అతని గురించి తనకేం అనుమానం లేదని, ఏవో చిన్న లోపాలు వున్నా తను వెళ్ళాక అవే సర్దుకుంటాయనీ ఆశ వ్యక్తపరచి, నిర్ణయమైన పెళ్ళి తప్పిపోతే తనకే అవమానం అని ఆమె పెళ్ళి ఆపడానికి అంగీకరించలేదు.

సరే, ఇంకేముంది? అనుకున్న వేళకి వైభవంగా పెళ్ళి జరిగింది. ఓ ఇరవై వేలు ఖర్చుపెట్టి ఒక్కర్తే కూతురు కాబట్టి రకరకాల నగలు, చీరలు, అల్లుడికి కానుకలు, గానకచ్చేరి, రిసెప్షన్, డిన్నర్ అన్నీ దర్జాగా చేశారు. పెళ్ళికొడుకు తల్లిదండ్రి, ఓ చెల్లెలు, ఇద్దరు ముగ్గురు స్నేహితులు, మాత్రం పెళ్ళికి వచ్చారు. పెళ్ళిలో పెళ్ళికొడుకుని, వాళ్ళ వాళ్ళని చూశాక, వాళ్ళకి ఆఉత్తరం గురించి ఉన్నకాస్త అనుమానమూ పోయింది. అల్లుడు ఎంతో పెద్దమనిషిలా కన్పించాడు, పెళ్ళి అయ్యాక వెంటనే పిల్లని తీసుకొని ప్లేనెక్కాడతను.

తర్వాత ఒక ఏడాది వరకు ఏ సంగతి తెలియదు నాకు. ఆలోపున ఆమె పుట్టింటికి రాలేదు. తర్వాత ఏడాది పురిటికి పుట్టింటికి వచ్చింది. ఆమెని చూసినవాళ్ళంతా ఆశ్చర్యపోయారు. చూపుల్లో యిదివరకటి చురుకు, కళాపోయి ఏదో నిశ్చలత్వం, దిగులు చోటు చేసుకున్నాయి. ఎప్పుడూ ఏదో ఆలోచనలో ఉన్నట్లుండేది, ఇదివరకటి ఆ గులాబిరంగు ఏమయిందో! ఆ కోమలత్వం ఎక్కడికి పోయిందో! ఏదో స్తబ్ధత, మౌనం, నిరాసక్తత పూర్వపు చలాకితనం-ఉబికే సంతోషం మచ్చుకైనా కనపడలేదు.

ఆమె ఆ విధంగా మారడానికి కారణం ఏమిటో ఎవరికీ అంతుపట్ట లేదు. ఏదో నెలలు నిండిన మనిషి, అనారోగ్యం అని సరిపెట్టుకున్నారను కుంటాను. ఎన్ని విధాల అడిగినా 'ఏంలేదు, ఏంవుంది?' అని తేలిగ్గా నవ్వేసేది. అతడి గురించి విన్నవార్తలు నిజమేమో అన్న అనుమానం వచ్చింది వీళ్ళకి. కాని ఆ విషయం ఆమెనించి ఏం రాబట్టలేక పోయారు.

ఓ మంచి రోజున ఆమె ఓ సుపుత్రుడిని కన్నది. పిల్లవాడు తల్లి తండ్రిని మించిన అందగాడు, తెల్లగా, బొద్దుగా ఎంతో ఆరోగ్యంగా వున్నాడు. కొడుకు పుట్టాక అతని కొక టెలిగ్రాం ఇచ్చారు. సంతోషం అని ఉత్తరం రాసిపడేశాడు. బారసాలకి రమ్మన్నారు, నెలలో రమ్మన్నారు. మూడో నెలలో రమ్మన్నారు. ఆఖరికి ఐదో నెలలో రమ్మన్నారు. మొదటి మగపిల్లవాడు లక్షణంగా నామకరణం చేసుకుని ముద్దుముచ్చట తీర్చుకో మని రాశాడు. అతను శెలవు లేదన్నాడు, తనకలాంటి వాటిల్లో నమ్మకం లేదని, వీలుచూసుకుని నిర్మలని తిరిగి రమ్మన్నాడు. ఆమె తిరిగి రావా లన్న కోరిక ఏది అందులో వ్యక్తం కాలేదు. ఆఖరికి నిర్మల బయలుదేరి వెళ్ళింది. నిర్మలని దిగబెట్టి అటునించి ముసలాయని వచ్చి చెప్పడంబట్టి, అల్లుడి ప్రవర్తనలో తనకేం లోపం కనబడలేదని, చాలా మర్యాదగా మాట్లాడాడని, భార్యతో మామూలుగానే మాట్లాడాడని, పిల్లవాడినికూడా ముదు చేశాడని తెలిసింది.

కొడుకు పుట్టిన తర్వాత ఆమెలో ఇదివరకటి ఉల్లాసం ఉత్సాహం పూర్తిగా తిరిగి రాకపోయినా, ఆ కొడుకుఆలనా, పాలనా ముద్దుముచ్చటల్లో చాలా వరకు తేరుకుందని చెప్పాలి.

ఆ తర్వాత మూడేళ్ళకి గాబోలు మళ్ళీ ఆమెని ఆమె తమ్ముడి పెళ్ళిలో చూశాను. ఈ మూడేళ్ళలోపల ఆమె పుట్టింటికి ఎన్నడూ రాలేదు. ఏదో వంకలు చెప్పేదిట. వీళ్ళు రమ్మని రాసినప్పుడల్లా. ఇదివరకటి కంటె ఇప్పుడు మరింతగా మారిపోయింది. బాగా తగ్గిపోయింది. జీవం లేని కళ్ళు, పాలిపోయిన మొగం, బాగా ఊడిన తలకట్టు .... చూస్తూంటే ఎవరికన్నా భయంకర వేదనని ఆమె తనలో దాచుకుందని స్పష్టంగా అర్థమవుతుంది. ఇదివరకటి కన్నా, మౌనం, పరధ్యానం ఎక్కువైందిట ఏమిటో తనలో తను మాట్లాడుకోవడం, నవ్వడం, ఏడవడం చేసేదిట. అలంకరణ ఏమీ చేసుకునేదిగాదు, మాసిన బట్టల్తో, రేగిన జుట్టుతో అలా గంటల తరబడ కూర్చునేది. ఆ కొడుకంటె మాత్రం వెర్రిప్రేమగా ఒక్క క్షణం వదలకుండా, ప్రాణాలన్నీ వాడిమీదే పెట్టుకుని, వాడికి ఏ కాస్త చికాకు చేసినా అల్లాడిపోయేది.

కూతురు స్థితి చూసి బెంబేలుపడిపోయారు తల్లిదండ్రి. ఎన్ని విధాలుగా బతిమలాడి అడిగినా ఏమీ చెప్పలేదు నిర్మల.

నిర్మల తమ్ముడి పెళ్ళికికూడా అల్లుడు రాలేదు 'శలవు దొరక లేదేమో' అని సర్దిచెప్పిన ఆమె మాటలు ఎవరూ నమ్మలేదు. పెళ్ళయ్యాక ఈ ఐదేళ్ళలో ఒక్కసారికూడా అతనికి శలవు దొరక్కపోవటం ఆశ్చర్యమే। పెళ్ళిలో ఏదో తిరుగుతున్నా .... ఆ ఒక్కగానొక్క ఆడబిడ్డ మొహంలో కళ కన్పించ లేదెవరికీ।

తమ్ముడి పెళ్ళయిన కొన్నాళ్ళకి అతనొక ఉత్తరం రాశాడు—"మీ అమ్మాయికి మతిస్థిరం తప్పింది. ఆమె ఇక్కడ వుంటే ఇంట్లో చూసేవారు ఎవరూ లేక ఆమె ప్రాణాలకే ముప్పు రావచ్చు. గాబట్టి ఆమె నక్కడే వుంచుకుని తగిన వైద్యం చేయించండి. దానికి తగ్గ ఖర్చు నేను భరిస్తాను, మతి స్థిరంలేని తల్లి దగ్గిర పిల్లవాడుండడం మంచిది కాదు. కనక రాజాని నాదగ్గిరికి పంపితే వాడు సరయినపద్ధతిలో పెరగడానికి అవకాశం వుంటుంది. పిల్లవాడిని ఎవరిచేతనయినా నాదగ్గిరికి వెంటనే పంపవల

సింది"—— అని, అది చదివి తల్లిదండ్రి నోట మాటరాక నిలబడిపోయారు. నిర్మల అంతా ముందే తెలిసినట్లు నిర్లిప్తంగా ఊరుకున్నా....పిల్లవాడిని పంపమన్నప్పుడు మాత్రం అల్లాడిపోయింది. భర్త, సంసారం ఏమయిపోయినాసరే, 'బాబుని మాత్రం కంఠంలో ప్రాణం వుండగా యీయను' అంటూ గొల్లున ఏడ్చింది. తల్లిదండ్రి అప్పటికయినా ఏం జరిగిందో చెప్పమని బ్రతిమలాడారు, ఎలాగో తెలిసిందని అప్పుడు చెప్పింది అసలు సంగతి.

'నిర్మల అక్కడికి వెళ్ళాక ఓ రెండు నెలలు నిజంగా ఇద్దరూ ఎంతో ఆనందంగా గడిపారు. తన అదృష్టానికి తనే మురిసిపోయింది. ఆ రెండు నెలలూ ఏదో లోకంలో విహరించింది. ఆమె ఇతర లోకాల మధ్యలోనే ఒకసారి అతనామెకి కర్తవ్యబోధన చేశాడు.... "మనం నాగరికులం। ఉన్నత స్థాయిలో ఉన్నవాళ్ళం ఇక్కడి పద్ధతులు, కట్టుబాట్లు అన్నీ చాలా ఆధునికంగా ఉంటాయి. నీకూ ఆధునికత అంటే ఇష్టమని నీ మాటలవల్ల గ్రహించే నిన్ను చేసుకోడానికి వెంటనే ఒప్పుకున్నాను. ఈ పద్ధతులకి, అలవాట్లకి అనుగుణంగా నీవు మారాలి. ఇందులో కొన్ని, భారతీయ సంస్కృతి సాంప్రదాయం అంటూ పుస్తకాల్లో చెప్పేవాటికి పూర్తిగా భిన్నం। నువ్వు ఇంక పాతపద్ధతులకి స్వస్తి చెప్పాలి।....' నిర్మలకి ఆ మాటల అర్థం కొన్ని రోజులకే తెలిసింది.

"ఒక రాత్రి ఇంట్లో ఐదారు జంటలు చేరారు. అందరూ వేర్వేరు ప్రాంతాలకి, భాషలకి చెందినవారు. నాగరికతకి మారు పేరులా వున్నాయి వారి వేషభాషలు, కొత్తగా అనిపించింది నిర్మలకి. కాసేపటికి బాటిల్స్ తెరిచారు. మగవాళ్ళు విస్కీ, బ్రాందీ అందుకున్నారు. ఆడవాళ్ళు షెర్రీ, పోర్టు రంగురంగుల తమాషా ఆకారాల్లో వున్న గ్లాసుల్లో నింపుకున్నారు. నిర్మలకికూడా ఓ గ్లాసునింపి ఇచ్చాడు శేఖరం. దగ్గరగా వచ్చి మెల్లగా రహస్యంగా 'మాడర్న్ సొసైటీలో నీ ప్రవేశానికి ఈ రోజే ముహూర్తం' అన్న అతన్ని తెల్లబోయిచూసింది నిర్మల. ఏం చెయ్యాలో తోచక గ్లాసునందుకుని ప్రక్కనపెట్టింది నిర్మల.

"చీర్స్!....గాడ్ బ్లెస్ ది కపుల్!" అని ఎవరో అనగానే అందరూ గ్లాసులు పైకిఎత్తి ఓ సిప్ తీసుకున్నారు. నిర్మల మాత్రం ఏం చెయ్యాలో తోచక అలాగే కూర్చుండిపోయింది. అందరూ ఆశ్చర్యంగా శేఖర్ వంక చూశారు. అవమానంతో ఎర్రబడ్డమొహంతో శేఖర్ నిర్మలవంక చూశాడు. నిర్మల తలదించుకుంది. నిర్మలా హెచ్చరికగా అన్నాడు శేఖర్. "క్షమించండి" అంది నిర్మల.

"మర్యాదకోసం కొంచెం తీసుకోండి, పోనీ అంత ఇష్టం లేక పోతే ఏ, కూల్ డ్రింక్ అన్నా తీసుకుని మాకు కంపెనీ ఇవ్వండి!" అన్నా రెవరో. నిర్మల వెళ్ళి ఓ ఆరంజి డ్రింక్ తీసుకొచ్చుకుంది. శేఖర్ ఆమెవంక తీక్షణంగా చూసి చూపు మరల్చుకున్నాడు.

మిగతా అందరూ రెండు మూడు సార్లు గ్లాసులు నింపుకుని బాటిల్సు ఖాళీచేశాక గొంతులు హెచ్చి, మాటలు, నవ్వులు కొంచెం ఎక్కువ కాసాగాయి. గ్లాసులు ఖాళీ అయ్యాక రికార్డుప్లేయర్ వేశారు. ఇంగ్లీషు రికార్డు తిరిగింది. 'నవ వధువుతో మొదట డాన్సు చేసే గౌరవం నాది!' అంటూ ఇంగ్లీషులో శేఖర్ పై అధికారి నిర్మల ముందు నిలబడి వంగి మర్యాదగా చేయిచాశాడు, నిర్మల బిత్తరపోయింది. శేఖర్ వైపు చూసింది. శేఖర్ ఈ లోకంలో లేడు. అసలెవ్వరూ ఈలోకంలో వున్నట్టు లేదు. కొద్దిసేపు ఆమెవంక అందరూ చూశారు. కుంచించుకుపోయిందామె 'నాకు డాన్సురాదు!' అనగలిగింది ఎలాగో! చురుగ్గా చూశాడు శేఖర్ ఆమెవంక. 'ఫర్వాలేదు, నేను నేర్పుతా. లేచి నాలుగడుగులు వేయండి." అన్నాడతను. మళ్ళీ ఆమె'ప్లీజ్, నన్ను బలవంత పెట్టకండి' అనితప్పించు కుంది.

తన నాగరికతకి, తన ఆధునికతకి శేఖర్ ఆధునికతకి మధ్య చాలా దూర ముందని ఆ రోజే గ్రహించింది నిర్మల.

ఆ రోజు మొదలు వాళ్ళిద్దరి మధ్య సంబంధాలు మామూలుగా లేవు. ఆమె 'ఇంటిలోఇలాటిపార్టీలు యీయవద్దని, తనని అలా బలవంతం

చేయవద్దని ప్రాధేయపడి ఏడ్చింది. అతను నీ కిష్టంలేని పనులు నీ చేత చేయించేటంత మూర్ఖుడ్నిగాను, నీ యిష్టం వచ్చినట్లు నీవుండు. కాని నాకు అడ్డురాకు! అన్నాడు.

అతనికి అడ్డురాకపోవడం అంటే ఏమిటి? అడ్డురాకుండా ఉండడం ఎంత కష్టమో ఆమెకి మరో నెలకిగాని తెలిసిరాలేదు. ఆలస్యంగా రాత్రి ఏ వంటి గంటకో ఇల్లుచేరడం, కొన్ని రాత్రులు అసలు ఇంటికే రాకపో వడం, వచ్చినా త్రాగిన మత్తులో బట్టలైనా మార్చకుండా ఏ డ్రాయింగు రూములో సోఫాలోనో సాగిలబడ్డం, పగలు నిద్ర, ఆఫీసు, రాత్రుళ్ళ సంచారం చూస్తూ ఆమె ఎంతోకాలం ఓపిక పట్టలేక పోయింది. అందు లోనూ చిన్నప్పటినుంచి అతి గారాబంగా, మాటకు తిరుగులేకుండా పెరి గిన ఆమెకి ఇలా తన ఉనికే పట్టనట్టు భర్త చేసే పనులు చూస్తే ఆత్మా భిమానం దెబ్బతింది. 'ఏమిటిదని' నిలదీసి అడిగింది. మాట మాట పెరి గింది. అతను స్పష్టంగా చెప్పేశాడు. "నీదొక పద్ధతి, నాదొక పద్ధతి. నీ పద్ధతి నాకు సరిపడదు. నా పద్ధతి నాకు సరిపడదు, నా పద్ధతి నీకు నచ్చదు. నీవు నీ పద్ధతిని మార్చుకోలేవు. ....ఇప్పుడింక నేను మార లేను! ఇంక మనం ఇలాగే ఉండక తప్పదు" అన్నాడతను. "నాగరికత అంటే త్రాగుడు, జూదం, రేసులు, డాన్సు అనేనా అర్థం!" అని ఆమె అడిగిందానికి 'తన దృష్టిలో అంతేనని' ఖచ్చితంగా చెప్పేడు అతడు. "నీకు కావల్సిన ఏ విషయంలోనూ లోటు జరగదు. నువ్వేం చేసినా నీ కడ్డురాను. నాకు నువ్వు అడ్డురాకు"

"భార్యా భర్తల సంబంధం అంటే ఇంతేనా?" కోపంగా అడిగింది.

"భార్యగా డ్రాయింగు రూములో అలంకరణవస్తువులా.... ఇంట్లో వుంటే నేనేం అడ్డుచెప్పను" నవ్వాడతను. రోషంలో ఆమె ఏడ్చి, పెళ్ళికి ముందువచ్చిన ఆకాశరామన్న ఉత్తరం చూపించి "మిమ్మల్ని నానుండి వేరు చేసేది ఈ స్త్రీయే అని నాకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతూంది. ఇందులో అన్ని సంగతులు నిజమని అప్పుడు నమ్మలేకపోయానుగాని

ఇప్పుడు నమ్మక తప్పడంలేదు. ఇవన్నీ నిజమేనా....ఎవరామె?" అనడి గింది. అతను ఒక్క క్షణం తత్తరపడ్డా వెంటనే తేలిగ్గానవ్వి "ఓ....తెలి సుండే చేసుకున్నావన్నమాట....అయితే ఇంక నన్ను అడగడం ఎందుకు? నిజమే! నీవు చూస్తానంటే........రేపు సాయంకాలం ఆఫీసునించి వచ్చే టప్పుడు తీసుకువస్తాను!...." అన్నాడతను నిర్భయంగా. ఆమె నోట మాటరాక స్థాణువైంది, "ఎందుకిలా నన్ను మోసం చేశారు?" అని ఏడ్చింది. అతనేం మాట్లాడలేదు.

ఆమెకి నిజంగానే మతి స్థిరం తప్పింది. మార్గరెట్‌ని చూశాక, మార్గరెట్ చాలా అందంగా ఉంటుంది. చక్కని గులాబిరంగు, కత్తిరించిన నొక్కులజుట్టు, మెరిసేకళ్ళు మహాచిత్రకారుల బొమ్మల్ని తలదన్నే అంగసౌష్టవం! మార్గరెట్ భర్తతో సరిపడక విడివడింది! కాని ఆమె భర్త విడాకులీయడానికి అంగీకరించక పోవడంవల్ల అలా వంటరి జీవితం గడుపుతూంది! శేఖర్‌తో మామూలు పరిచయం ప్రణయంగా చాలా కాలం క్రిందనే మారినా పెళ్ళి చేసుకునే వీలులేక ఇద్దరూ అలా ఉన్నారు. ఏదో ఆఫీసులో పనిచేస్తూ కాలం గడుపుతూంది మార్గరెట్. మార్గరెట్‌తో మాటలు కలవక పూర్వమే చాలా అర్థం అయింది నిర్మలకి.

"మాట్లాడుకుంటూ ఉండండి!" అని శేఖర్ లోపలికి వెళ్ళిన సమ యంలో మార్గరెట్ మెల్లిగా అంది. "నాకు మీ పరిస్థితి అర్థం అవుతూంది. మీరిలా బాధపడతారనే........నేను ముందుగానే మీకా ఉత్తరం రాశాను. మీరది నమ్మినట్టులేదు. శేఖర్‌కి తల్లిదండ్రులని, సంఘాన్ని మరిపించ డానికి, అతని ఇల్లు వాకిలి చూడడానికి అతని కులానికి చెందిన ఒక భార్య కావాలి. అందుకే మిమ్మల్ని కట్టుకున్నాడు. అతను నేను ప్రేమించు కున్నాం. మిమ్మల్ని మధ్య నలిగి బాధపడనీయకూడదని నేను ప్రయ త్నించినా మీరు చేతులారా మీ జీవితం పాడుచేసుకున్నారు." నిర్మలకి ఆమె స్నేహసౌహార్దాలు ఆశ్చర్యంతోపాటు ఆశ కలిగించాయి. "నా యెడ

సానుభూతివుంటే దయచూపి, నా సంసారం చక్కదిద్దండి" అని వేడుకుంది. "మీ శ్రేయస్సుకోరి నేను చేయగలిగింది చేశాను. ఇప్పుడు అతన్నాపడం నా శక్తిలో లేదు. నిజానికి మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటానని చెప్పినపుడు, ఒక అమాయకురాలి జీవితం నాశనం చెయ్యవద్దని ఎంతో చెప్పి, పోట్లాట పెట్టుకుని కొన్నాళ్ళు దూరమయ్యాను. అతని శుభలేఖలో యడ్రసుచూసి మీకు ఉత్తరం రాశాను, ఎలాగైనా ఈ పెళ్ళి అపుదామని. మిమ్మల్ని పెళ్ళాడాక, మొదట్లో ఎప్పుడూ మీ దగ్గిరే ఉండడం చూసే ఉంటాడు. నన్ను మీరు మరిపించగలిగారు అనుకున్నాను గాని, అది క్రొత్తమోజు అని రెండోనెలలోనే తేలిపోయింది. మళ్ళీ ఇప్పుడు రోజూ ఇంటికి వస్తాడు. ప్రాధేయపడుతాడు, ప్రేమకబుర్లు చెపుతాడు. అతన్ని నేనూ ప్రేమించినదాన్ని. నా పట్టుదల నిలుపుకోలేను. ఇంక ఇప్పుడు అతన్ని వద్దనేశక్తి నాకులేదు. మీరే అతన్ని ఎలాగో మీవైపు తిప్పుకోండి. నా చేతనయినంత సహాయం చేస్తాను. అతన్ని నమ్ముకుని వివాహం చేసుకున్న మీ కన్యాయం జరగడం నేనూ చూడలేను" అందిట.

తర్వాత నిర్మల మరీ విషమ సమస్యలో యిరుక్కుంది. మార్గరెట్ అందచందాలు చూశాక శేఖర్‌ని ఇంక తనవైపు త్రిప్పుకోవడమనేది అసంభవంలాగ కన్పించింది. అసలు యింటికేరాని, యింటిపట్టునే వుండని భర్తని ఆకర్షింపచేసుకోవడం అనేది ఎలాగ?

యీ పరిస్థితుల్లో ఆమె పురిటికి పుట్టింటికి వచ్చింది. సుమారు ఏడాది పుట్టింటి దగ్గిరవుండి తిరిగి వెళ్లాక మార్గరెట్‌ని యింట్లోనే చూసింది నిర్మల. అప్పుడే ముసలాయనకి "స్నేహితురాలు" అని అబద్ధం చెప్పక నిజం చెప్పివుంటే కోర్టుద్వారా ఏమన్న చక్కబరచివుండేవాళ్ళేమో! కనీసం కళ్లెదుటచూస్తూ మనోవ్యధతో సర్వనాశనం కావడం తప్పివుండేదేమో! ఆమెకది ఒక పెద్ద పరీక్ష! చిన్నప్పటినుంచి అందమైనది, తెలివైంది, అని అపురూపంగా పెరిగిన తను యీరోజు భర్తచేత ఎందుకూ పనికిరాని మని

షిగా తిరస్కరింపబడ్డం. ఆ నిరాదరణ....ఆమెకా పరాభవం తట్టుకునే శక్తి లేకపోయింది. అలా అని తన అశక్తతను అందరికి ఎరుకపరచ డానికి మనసొప్పలేదు. ఏరి కోరి కావాలని చేసుకున్న భర్తనించి వేరుపడి యింటికి వెడితే తనకి, తన కుటుంబానికి ఎంత సిగ్గుచేటు!

ఈ ఆలోచనల్తో ఆమె మనసు ఎంత చివికి కృశించిందో ఊహించ వచ్చు. నిర్మల వచ్చాక మళ్ళీ మార్గరెట్ తన యింటికి వెళ్ళింది. ఆమెతో పాటు శేఖర్ మకాం మూడువంతులు అక్కడే!

దిగులుతో ఒంటరిగా ఏ మూలో, ఏ అలంకారాలు లేకుండా కూర్చోవడం, తిండి మానేయడం, ఏడ్చి ఏడ్చి స్పృహలేకుండా పడిపోవ డం ఇవన్నీ మొదలయ్యాయి. అతను ఇవన్నీచూసి ఓ నర్సింగ్‌హోములో చేర్పిస్తే, నాకేరోగం లేదని యింటికి వచ్చేసింది. పుట్టింటికి వెళ్ళమన్నా అందుకూ అంగీకరించలేదట, ఆమెలో మార్పు అతను గమనించినా తోటి మనిషిగా సానుభూతి చూపించడంతప్ప, తన పద్ధతిని మార్చుకోవడం, భార్యపట్ల ఏ మమకారం చూడలేదు. భర్త మారుతాడన్న ఆశ ఆమెకి పూర్తిగా అడుగంటింది. పూర్వంలా భర్త చర్యలకి బాధపడ్డం, దెబ్బలాడ్డం కూడ మానుకుంది. పిల్లవాడొక్కడితోనే ఆమెకి కాలక్షేపం! వాడే ఆమె సర్వస్వం!

"యీ నరకం యిలా మూడేళ్ళు అనుభవించాక.... ఆఖరికి తమ్ముడి పెళ్ళి అంటే తప్పనిసరిగా యింటికి వచ్చింది. ఆ తర్వాత జరిగింది చెప్పా నుగా!....అతను పిల్లవాణ్ణి పంపమని రెండు మూడుసార్లు ఉత్తరాలు రాసినా వీళ్ళు లక్ష్యపెట్టలేదు. తర్వాత కొన్నాళ్ళకి నోటీసు పంపాడు అతను. "పిల్ల వాడి తల్లికి మతి చెడింది కాబట్టి పిల్లవాడి సంరక్షణభారం ఆమె చేతిలో వుంచడం శ్రేయస్కరంకాదు కాబట్టి, ఆమెకి తిరిగి మతిస్థిమితం చేకూరే దాకా పిల్లవాణ్ణి తన కప్పగించవలసింది" అంటూ, ముసలాయన కోర్టు కెక్కుతాననీ, అల్లుణ్ణి మూడుకోర్టులు త్రిప్పి మూడు సముద్రాల నీళ్ళు

త్రాగిస్తానని గెంతులేసినా ప్లీడరుగా తండ్రిహక్కు ఏ కోర్టు కాదన్నదని తెలిసి ఏం చెయ్యలేక విస్సహాయంగా వుండిపోయాడు.

చివరికి అతను తన పంతం చెల్లించుకున్నాడు. ఆ పిల్లవాణ్ని బల వంతంగా తీసికెళ్లాడు, చూడాలని వున్నప్పుడు రావచ్చని అంతే!.... ఆమె కప్పుడు స్పృహతప్పి మరి రెండు రోజులవరకు తెలివిరాలేదు. ఆ తర్వాత తెలివివచ్చాక....ఆ పిల్లవాడిధ్యాస తప్పించి మన తెలివిలేదు. కొడుకుని వెతుక్కుంటూ తిరగడం, పిలవడం, అన్నం కలిపి కంచం ముందులేని రాజాకి తినిపించడం, బట్టలు పౌడరు అన్ని సిద్ధం చేసుకుని లేని రాజాకి ముస్తాబు చేయడం కోసం కూర్చోడం, రాత్రి ప్రక్కన ఖాళీ జాగాని, ఏ దుప్పటినో జోకొడ్తూ కబుర్లు చెప్పడం యివన్నీ చేస్తుంది.

ఆమె రాజాకోసం వెతికినప్పుడల్లా తల్లి దండ్రీ.... "ఆ గదిలో వున్నాడమ్మా అన్నం తిన్నాడమ్మా, బట్టలు నేను తొడిగానమ్మా, నువ్వు అన్నంతిని పడుకో తల్లీ" అంటూ నచ్చచెపుతారు. ఆమెకి తన అవసరాలు తీర్చుకునే తెలివిపోయింది. పాపం, అన్నీ ఆ తల్లే చెయ్యాడం ఆమె అన్నంపెట్టి తలదువ్వి బట్టలు కట్టబెడ్తుంది.

శేఖర్ వాళ్ళది మరీ ఆధునిక కుటుంబం! "ఆ యింట్లో అందరూ మరీ నవనాగరికులు, వీళ్ళ తర్వాత తెలిసికొన్న దాన్నిబట్టి....ఆ యింట్లో ఆడ, మగ అందరిమీద పాశ్చాత్య ప్రభావం చాలావుంది. ఒక అక్క ఎవరో విదేశీయుడిని పెళ్ళిచేసుకుని అక్కడే వుండిపోయింది. యింకో అన్నయ్య అంతే, ఒక చెల్లెలు భర్తకి విడాకులిచ్చి ఉద్యోగం చేసు కుంటూంది. యిహ యీ శేఖర్ ఒక్కడినైనా సవ్యంగా మన పద్ధతుల్లో సవ్యంగా తీసుకురావాలని తల్లితండ్రి పెళ్ళిచేసుకోమంటే, వాళ్ళ బలవంతం వల్ల పెళ్ళిచేసుకుని యిలా వెలగబెట్టాడు అతను. ఆ తల్లి దండ్రులకోసం, వాళ్ళ ముచ్చటకోసం, వంశాకురం కోసం వాళ్ళ కోరికప్రకారం ఈ పసి వాణ్ని తల్లినించి వేరుచేసి వాళ్ళ కప్పగించాడు. అంతస్తు పాటించక,

సాంప్రదాయం, వంశం, గౌరవం ఏ మంచి చెడూ విచారించక, పై మెరుగులకి మోసపోయి గోతిలోకి దిగామని తల్లీ దండ్రీ వాపోతారిప్పుడు. కాని ఏం లాభం? చేతులుకాలక ఆకులు పట్టుకుని!?

యీలోగా ఆమెకి పూర్తిగా మతిచెడింది. ఎన్నివైద్యాలు చేయించినా లాభం లేకపోయింది. పిల్లవాణ్ని పంపిస్తే బాగుపడుతుందని వీళ్ళెంత ప్రాధేయపడుతూ రాసినా అతను జవాబైనా రాయలేదు. ఏళ్ళు జరిగిపోయాయి! వీళ్ళు ఆత్మాభిమానం చంపుకుని ఆమెని తీసుకుని ఢిల్లీవెళ్ళి పిల్లవాడ్ని చూపించారు తండ్రినిమించి అధునికంగా తయారయిన పన్నెండేళ్ళ రాజా "తల్లి" అంటే నమ్మలేదు. నిర్మలకూడా అతన్ని చూసి "కొడుకు" అంటే నమ్మలేదు. "వీడు నా రాజాకాదు! నా రాజా ఇంతవాడెక్కడ? నా బాబు నాకు తెలియదా!" అంటూ ఎవరినో చూపించి తనని మోసగిస్తున్నారన్నట్టు మాట్లాడిందట. ఆమె స్మృతి పథంలో నాలుగేళ్ళ రాజాయే నిలిచాడు!

ఇంక వీళ్ళు పూర్తిగా ఆశ వదులుకున్నారు. ఏదో వాళ్ళున్నన్నాళ్ళు వాళ్ళచూస్తారు! తర్వాతఆమెగతిఏమిటి? ప్రతి రోజూ ఎక్కడికో అక్కడికీ "రాజా! రాజా" అంటూ వెళ్ళిపోతుంది. చూశావుగా మా యింట్లోకి ఎలా వచ్చిందో!.........వీళ్ళు వెతుక్కు తెచ్చుకుంటారు. పాపం.........ఆమెని చూస్తుంటే ఎలాంటి మనిషి ఎలా అయిపోయిందని ఎంతో బాధగా వుంటుంది!

"ఆమెని చూడగానే నాకేమనిపించిందో తెలుసా! ఎవరో నీకోసం వచ్చారు గాబోలు.........యీ ఆడస్నేహితు లెప్పటినించా అని ఆశ్చర్యపోయాను. చూడ్డానికి మామూలుగానే వుందిగదూ!" నవ్వాడు మూర్తి తనలో పెల్లుబికే విచార ఉద్రేకాల్ని పైపైన కప్పిపుచ్చుకోచూస్తూ.

"అంతా మామూలేనండీ! పాపం ఈయనకే ఎక్కడలేని జాలి, సానుభూతి" అప్పుడే వచ్చిన లలిత అంది కొంటెగా నవ్వుతూ. ఆమె

గ్లాసులు తీసుకుని లోపలికి వెళ్లాక. "ఏం కథ? ఏం లేకుండా అలా అంటుందేమిటి? ఆవిడ?" మూర్తి కొంటెగా వేళాకోళం చేశాడు.

"ఏడిశావులె! అదేంకాదు. లలిత వచ్చిన క్రొత్తలో నీకు చెప్పి నట్టే ఆవిడకీ యీ కథ అంతా చెప్పాను. అందులో కొంటెతనానికిపోయి కాలేజీ రోజుల్లో ఆవిడ్ని నేనెంతగా ఆరాధించి వర్ణించాను. ఆమెకి పెళ్ళవు తూంటే నేపాడిన విరహగీతాలు వినిపించాను. అది విని యిప్పటికీ నిర్మ లంటే నాకేదో వుందని ఆవిడ అనుమానం. అందుకే అప్పుడప్పుడు హాస్యంగా యిలా దెప్పుతూంటుంది. నిర్మలగురించి అలా అనుకోవడమే పాపం!"

"అవునులే....ఏదో సరదాగాఅన్నాను....అంతే!"మూర్తి గాఢంగా నిట్టూర్చి లేచాడు.

"ఏ నాడో ఆమెచేసిన పాపానికి శిక్ష అనుభవిస్తూంది. ఆ శిక్ష ముగిసే దెప్పటికో!" రామం బరువుగా అన్నాడు.

♦ ♦ ♦

ఆ శిక్ష మరికొన్ని రోజులకే ముగిసింది.

"పాపం నిర్మల చనిపోయింది తెలుసా!" ఆరోజు ఆఫీసులో మూర్తితో అన్నాడు రామం.

"ఏ నిర్మల?"

"అదే! మా ఎదురింటి అమ్మాయి. ఆ రోజు చూశావు గదా!"

"ఆ....ఆ....నిజమే? ఎలా చనిపోయింది?" ఆత్రుతగా అడిగాడు మూర్తి.

"నిన్న సాయంత్రం వీధిలో నిలబడి మామూలుగా రాజాని వెతు కుతూ పిలుస్తూంది. రోడ్డుమీద ఎవడో నాలుగేళ్ళ అబ్బాయి బంతి ఆడు

తున్నాడు. అటునించి ఓ లారీ వేగంగా వస్తూంది....ఆ అబ్బాయిని రాజా అనుకుని, లారీక్రింద పడతాడనుకుంది కాబోలు 'రాజా....రాజా....లారీ.... లారీ!' అంటూ పరిగెత్తింది. ఆ అబ్బాయి తప్పుకున్నాడుగాని, ఆమె లారీక్రింద పడింది."

"సుఖపడింది!" అన్నాడు మూర్తి బరువుగా.

"అవును, యింక ఏ రాజా ఏమైన ఆమెకక్కరలేదు....యింక ఏ రాజాని వెతుక్కోనక్కరలేదు ఆమె!" నిట్టూరుస్తూ అన్నాడు రామం.

-)o(-